క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ సతీష్ కుమార్



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్‌ఐ సతీష్‌కుమార్

కోసిగి: కోసిగి ఎస్‌ఐగా సతీష్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆదోని ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేస్తు బదిలీపై కోసిగికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్‌ఐ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి



మంచాలమ్మ సన్నిధిలో కర్ణాటక హౌకోర్టు జడ్జి ఉమేష్ మంజునాథ భట్ ఆడిగ

మంత్రాలయం :ప్రముఖ మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక హైకోర్టు జడ్జి ఉమేష్ మంజునాథ భట్ ఆడిగ శనివారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని హారతులు పట్టారు. అనంతరం మంత్రాలయం మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫల,పూలమంత్రాక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు.

పెద్దతుంబళం ఎస్‌ఐగా చిన్నపీరయ్య



ఆదోని రూరల్ : పెద్ద తుంబళం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా శనివారం చిన్నపీరయ్య బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆదోని త్రీటౌన్ ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబును కర్నూలు సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా చిన్న పీరయ్య మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూస్తామని చెప్పారు.

పోలీసుల పల్లె నిద్ర

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలం చెట్నేహళ్లి, చౌలహళ్లి గ్రామాల్లో శనివారం పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస నాయక్, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజులు మాట్లాడుతూ ప్రజలు, పోలీసుల మధ్య సఖ్యత ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులు దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్య వివాహాలు, సైబర్ నేరగాలపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

కుప్పం వెళ్లి పింఛన్ అందజేత



చంద్రకళ పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ రామాంజినేయులు

కౌతాళం: మండల పరిధిలోని ఏరిగేరి గ్రామానికి చెందిన కురవ ఉల్లేప్ప, హనుమంతమ్మ కూతురు దివ్యాంగురాలు చంద్రకళ కుప్పం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతుంది. దివ్యాంగురాలు చంద్రకళ రావడం ఇబ్బందిగా ఉందని ఆమె తల్లిదండ్రుల విన్నవించగా వలంటీర్ రామాంజినేయులు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు శనివారం కుప్పం వెళ్లి రెండు నెలల పింఛన్ సొమ్మును చంద్రకళకు అందజేశారు. దీంతో చంద్రకళకు వలంటీర్‌తోపాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కురిసిన వర్షం

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలం కల్లుదేవకుంట, చిలకలడోణ, చెట్నేహళ్లి, మాధవరం, సూగూరు, వగరూరు తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం పెద్ద వర్షం కురిసింది. వాగులు, పోలాలు, వంకలు పొంగి పొర్లాయి. వర్షం రాకతో రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

ఉరుకుందలో 20న వేలం పాటలు

కౌతాళం: ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 20న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కొబ్బరి కాయలు సరఫరా, అర కొబ్బరి చిప్పల్ని పోగు చేసుకొనే హక్కు కోసం వేలం పాటను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది 28-7-2023 నుంచి 27-7-2024 వరకు ఒక సంవత్సరం పాటు వేలం పాట ద్వారా హక్కు కోసం బహిరంగా వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు సీల్డ్ టెండరు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీల్డ్ టెండరును కార్యాలయంలో ఉంచిన బాక్స్‌ల్లో వేయాలని, అలాగే ఈ టెండరు ద్వారా వేలం పాట వేసుకోవాలనుకున్నా వారు ఈనెల19 మధ్యాహ్నంలోపు ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేసుకోవాలని అన్నారు.

ఎవరి కోసం నీ ఆరాటం !

- పవన్ కళ్యాణ్‌పై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి
- వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : జగనసేల అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. వలంటీర్లపై అసత్యారోపణలు ఎవరి కోసం... యాత్రలు, సభలు, సమావేశాలు ఎందుకోసం... ప్రజల పక్షనా నిలబడేందుకా.. లేక చంద్రబాబునాయుడి కోసమా అని నిలదీశారు. దేశానికే ఆదర్శమైన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ప్రజలు మెచ్చుకుంటున్నారని, వాటి ద్వారా టీడీపీ కనుమరుగైపోతుందన్న అక్కసుతోనే వలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని పన్నాగం, కుట్రలకు తెరలేపారని, ఎల్లోమీడియాతో కుమ్మక్కై విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, మరోమారు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పట్టణంలోని 24వ వార్డు క్రాంతినగర్‌లోని శ్రీ అంజనేయస్వామి కళ్యాణ మండపం ఆవరణలో శనివారం కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పట్టణగౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, సాంస్కృతిక జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ సిద్ధాక్రిష్ణవేణి పాల్గొన్నారు. వెంకన్నపేటవీధి భజరంగదళ్ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి మాట్లాడారు. పవన్‌కళ్యాణ్, సంస్కృతి, సభ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సాంకితేక సమస్యలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించడంతోపాటు ప్రజలకు అవసరమయ్యే 11 రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. గతంలో కులం, ఆదాయం, ఆర్వోఆర్, అడంగళ్ తదితర సర్టిఫికెట్లను పొందాలంటే వారం, పది రోజులు, నెలరోజులు కూడా తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని చెప్పారు. జగనన్న పాలనలో దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోపే సర్టిఫికెట్లను వలంటీర్లు ఇళ్ల వద్దకే వెళ్లి అందజేస్తున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో పేదలకు ప్రభుత్వ పథకాలు వచ్చేవి కాదన్నారు. టీడీపీ అనచరవర్గానికే పెద్దపీట వేసేవారన్నారు. ప్రస్తుతం ఒక ఇంట్లో అవ్వకు లేదా తాతకు మాత్రమే పింఛన్లు వస్తున్నాయని, ఇకపై అవ్వాతాతలకు ఇద్దరికీ పింఛన్లు వచ్చేవిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా ఆదుకుంటానని, అర్ధరాత్రి ఇంటి తలుపు తట్టవచ్చన్నారు. 2024-29లోనూ జగనన్నే సీఎంగా కొనసాగుతారని స్పష్టం చేశారు.

పక్షవాతంతో కాళ్లు, చేయి పడిపోయాయి



పక్షవాతంతో ఎనిమిదేళ్లుగా కాలు, చేయి పడిపోయి ఇంట్లోనే ఉన్నా. గత ప్రభుత్వం హయాంలో పింఛన్ కోసం మా కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకున్నాం. ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చింది. వలంటీర్లు ఇంటింటికి వచ్చి తన సమాచారం తెలుసుకున్నారు. పక్షవాతం వ్యాధి, గుండెజబ్బు ఉన్నట్లుగా వివరించాం. విషయాన్ని స్థానిక పార్టీ నాయకులు, వలంటీర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గుండెజబ్బు కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి మూడేళ్ల క్రితం పంపారు. ఆపరేషన్ చేయించుకొని ఆరోగ్యవంతుడిగా తిరిగి ఆదోనికి వచ్చాను. ప్రస్తుతం పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. కులం, ఆదాయం సర్టిఫికెట్లు కావాలని చెప్పారు. వెంటనే వాటికి దరఖాస్తు చేశాను. తన ప్రాణం నిలబెట్టిన ఎమ్మెల్యే చేతులమీదుగానే సర్టిఫికెట్లు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– చిలుక శ్రీనివాసులు, శ్రీరామ్‌నగర్ కాలువగడ్డ, ఆదోని పట్టణం

ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పొందాను



నాకు కొడుకు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు పిల్లల చదువుల కోసం కులం, ఆదాయం సర్టిఫికెట్లు దరఖాస్తులు చేసుకున్నాం. వలంటీర్లు పిలిచి సభలో అందించారు. బేల్దారి పని చేసుకునే తమకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు అంటే ఏమో తెలియని తమకు పిలిచి సర్టిఫికెట్లను అందజేయడం సంతోషంగా ఉంది. – భీమక్క, క్రాంతినగర్, ఆదోని పట్టణం

ఉచితంగా సర్టిఫికెట్ల అందజేత సంతోషకరం



జగనన్న చేదోడు, చేనేత పథకాల కోసం కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం గురువారం దరఖాస్తు చేసుకున్నా. శనివారం ఆంజనేయస్వామి గుడి వద్దకు రావాలని అక్కడే సర్టిఫికెట్లను అందిస్తామని వలంటీర్ సమాచారం అందించారు. అక్కడ ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందుకున్నాం. తమకు చాలా సంతోషంగా ఉంది.

– టి.లక్ష్మి, క్రాంతినగర్, ఆదోని పట్టణం

మీ ఇంటినీ ఇలాగే ఉంచుతారా?

- కళాశాలలో అపరిశుభ్రతపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆగ్రహం
- 'నాడు- నేడు' పనుల్లో నిర్లక్ష్యం తగదని హెచ్చరిక



నాడు- నేడు పనులను పరిశీలిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

ఆదోని సెంట్రల్: 'పని ఏదైనా అది మనసు పెట్టి చేయాలి.. మీ ఇంటిని కూడా ఇలానే అపరిశుభ్రంగా ఉంచుకుంటారా' అంటూ ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ ప్రిన్సిపాల్‌పై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కళాశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను ఆయన పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండడం, ల్యాబ్ పరికరాలపై దుమ్ము పేరుకుపోయి ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. కోటి రూపాయలతో నాడు- నేడు పనులు జరుగుతున్నాయని, అందులో రూ.10 వేలు ఖర్చు చేసి మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచలేరా అని ప్రశ్నించారు. ఇంత బాధ్యతారహితంగా ఉంటే ఎలా అంటూ మందలించారు. కళాశాల పనులను పర్యవేక్షించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు సూచించారు.

పర్యవేక్షణ లేకుండా ఫలితాలు సాధించలేం

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వస్తున్నారు.. అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించడం కాదని, స్వయంగా పాఠశాలల తనిఖీలకు మీరు వెళితే ఎంత వరకు ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉంటారో అది చూసుకోవాలని డీఈఓకు చురకలు అంటించారు. తనిఖీల్లో ఏ ఉపాధ్యాయుడు ఎంత వరకు పాఠాలు చెప్పాడు.. పాఠశాలల నిర్వహణ ఎలా ఉంది.. అనే విషయాలు గమనించాలన్నారు. పర్యవేక్షణ లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఫలితాలు తీసుకురాలేమన్నారు. వెనుకబడిన ప్రతి విద్యార్థినీ తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు మంచి చేస్తే దేవుడు కూడా మంచి చేస్తాడనే విషయాన్ని గమనించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి, డీఈఓ రంగారెడ్డి, ఎస్‌ఎస్‌ఏ డైరెక్టర్ వేణుగోపాల్, ఏపీఈడబ్ల్యు ఐడీసీ ఎస్ఈ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చాతుర్మాస దీక్ష స్వీకరణ



స్వామిజీకి నిరాజనం పడుతున్న శ్రీమఠం అధికారులు



దీక్ష స్వీకరణోత్సవ వేడుకలో భక్తులు

మంత్రాలయం : ప్రముఖ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆనవాయితీలో భాగంగా చాతుర్మాస దీక్ష స్వీకరించారు. శనివారం శ్రీమఠంలో రాఘవేంద్రుల బృందావన సేవ, మూలరాముల సంస్థాన పూజలు కానిచ్చి స్వామిజీ దీక్ష బూనారు. శ్రీమఠంలోని సుజయీంద్రతీర్థులు, సుశమీంద్రతీర్థులు, సుయతీంద్రతీర్థులు బృందావనాలకు పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చరణలు, భక్తుల నీరాజనం మధ్య శాస్త్రోక్తంగా దీక్ష స్వీకరణ వేడుక కానిచ్చారు. సెప్టెంబర్ 29వ తేదీ వరకు 76 రోజుల పాటు పీఠాధిపతి దీక్షలు ఉంటా రు. చాతుర్మాస దీక్షా నియమాళిలో స్వామిజీ నడచుకుంటారు. ఆహార నియమాలు పాటిస్తూ దీక్షలో కొనసాగుతారు. ఆనవాయితీ ప్రకారం 76 రోజులూ శ్రీమఠంలోనే గడుపుతారు. ఎలాంటి ధార్మిక పర్యటనలు చేయరు. దీక్ష స్వీకరణోత్సవానికి కర్ణాటక రాష్ట్రం కుందాపుర వ్యాసరాజ మఠం పీఠాధిపతి లక్ష్మీంద్ర తీర్థులు హాజరయ్యారు. దీక్షా స్వీకరణోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మూలదేవర సంస్థాన పూజ మరింతగా మైమరిపించేలా కానిచ్చారు. వేడుకలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి బిందుస్వామి, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పకడ్బందీగా చేపట్టండి



మాట్లాడుతున్నమురళీ మోహన్ రెడ్డి

కోసిగి: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వందశాతం అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో అమలు చేసిన జగనన్న సురక్ష పథకం పకడ్బందీగా నిర్వహించాని జేసీఎస్ మండల కన్వీనర్ పి. మురళీ మోహన్ రెడ్డి వలంటీర్లకు సూచించారు. శనివారం మండలంలోని చిన్న భూంపల్లి, పెద్ద భూంపల్లి గ్రామంలోని వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల, గృహసారథులు కలిసి ప్రతి ఇంటిని సందర్శించి వారి అవసరాలు నిమిత్తం సర్వే చేసి 11 అంశాలకు సంబందించి అర్హులైన వారు ఉంటే వారికి ఉచితంగా సర్టిఫికేట్స్ జారీ చేయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఉసేని, దొమ్మయ్య, రాగప్ప, భీంరెడ్డి, వీరారెడ్డి, రామయ్య, నరసింహులు, శ్రీనివాసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్ : సంతెకూడ్లూరు మజారా గ్రామం ఎడవలికి చెందిన టీడీపీ నాయకులు రామాంజనేయులు, బీజేపీ నాయకులు పాండు, తిమ్మప్ప, గణేష్‌తో పాటు మరో 15 కుటుంబాలు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ గ్రామ నాయకులు ప్రతాపరెడ్డి, మధు సమక్షంలో వారు వైఎస్సార్సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవలను మెచ్చి వైఎస్సార్‌సీపీలో చేరామని రామాంజనేయులు, పాండు, తిమ్మప్ప తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, చిన్నసిద్ధ, శంకరప్ప, వీరేష్, ఈరన్న, మత్రి ఈరప్ప, బంగారి, కందర సిద్ధ, సన్న, దండు, గోవర్ధన్, తిమ్మప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్ : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున కోరారు. ఈ మేరకు శనివారం ఆదోని పట్టణంలో పర్యటించిన రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌కు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు మహేష్, పవన్, నరేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వాయుపుత్రునికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంతో పాటు గ్రామాల్లో ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, అగసలదిన్నెలోని అంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు

ఆదోని అర్బన్ : పట్టణశివారులోని మంగరాయ సన్నిధిలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం దోషపరిహార పూజలు జరిగాయి. మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో వేద పండితుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మ శనీశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ప్రతి భక్తునితో శనీశ్వరస్వామికి తేనాభిషేకం చేయించారు. అనంతరం మృత్యుంజయహోమం, శాంతిహోమం నిర్వహించారు. ముందుగా మంగరాయ ఆంజనేయస్వామికి ఫలపంచామృతాభిషేకం, పూలు, వెండి అలంకరణ మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

ఆదోనిరూరల్ : మండలంలోని జాలిమంచి-దొడ్డనకేరి గ్రామాల మధ్య ఉన్న వంకపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన రెండు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిని కుంగిపోయే ప్రమాదం ఉందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీడీఓ గీతావాణి

ఆదోని రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ గీతావాణి అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని విరుపాపురం గ్రామంలో సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ అధ్యక్షతన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలోని 800 మంది లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతావాణి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. దరఖాస్తు చేసుకున్న రోజునే ఎలాంటి వ్యయ ప్రయాసాలు లేకుండా, ఖర్చు లేకుండా ప్రజలకు సర్టిఫికెట్లను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ అరుణమ్మ, గ్రామ సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్, వైస్ సర్పంచ్ వసంతమ్మ, వీఆర్వో తిరుమల రెడ్డి, పంచాయతీ సెక్రటరీ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో వణుకు

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కోసిగి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థతో ప్రతిపక్ష నాయకుల్లో వణుకు పుట్టించిందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఎద్దేవా చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన కోసిగి మండలం కామన్‌దొడ్డి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో 8 క్లస్టర్ల పరిధిలోని 524 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందిన తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ల సేవలను చూసి ఓర్వలేక టీడీపీ నేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కళ్యాణ్ నానా యాగీ చేస్తున్నారని ఆరోపించారు. పారదర్శకంగా పథకాలు చేరవేయడంలో వలంటీర్లు ప్రధాన భూమిక పోషించడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని వాపోయారు. చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలన్న తపన తప్ప పవన్‌కళ్యాణ్‌కు వేరే ఆలోచన లేదని దుయ్యబట్టారు. సొంత పార్టీ నేతలే పవన్ తీరును ఈసడించుకుంటున్నారన్నారు. ఓ అజెండా అంటూ తనకు లేదని, జగనన్న పాలన గిట్టక ఇలా దూషణలకు దిగుతున్నారని విమర్శించారు. ఇలాంటి నేతల దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఇకనైనా హుందాతనంగా రాజకీయం చేయాలని హితవు పలికారు. కామన్‌దొడ్డి గ్రామంలో సమస్యల పరిష్కారానికి త్వరలోనే నివేదికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. చంద్రబాబు, పవన్ పిచ్చి మాటలకు మోసపోవద్దని, ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బెట్టనగౌడ్, ఎంపీపీ ఈరన్న, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ రుద్రగౌడ్, ఎంఈవో నాగేషప్ప, సర్పంచ్ మునెమ్మ, ఏపీఎం సత్యమ్మ, ఎస్‌ఐ రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పరశురామ్, ఉరుకుంద ఈరన్న స్వామి ట్రస్టు బోర్డు సభ్యుడు బుల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భర్త, అత్త, మామలపై కేసు నమోదు

ఆదోనిఅర్బన్ : ఆదోని పట్టణంలోని అమరావతి నగర్‌లో నివాసముంటున్న వివాహిత అయ్యమ్మ(24) శుక్రవారం ఉరి వేసుకుని మృతిచెందిందని, అయ్యమ్మ మృతికి కారకులైన భర్త సుధాకర్, అత్త సువర్ణమ్మ, మామ యేసన్నలపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యేడాది క్రితం సుధాకర్‌కి కోసిగికి చెందిన అయ్యమ్మను ఇచ్చి వివాహం చేశారన్నారు. వివాహం జరిగినప్పటి నుంచి అత్తింటి వారు పెట్టిన శారీరక, మానసిక హింసలు తట్టుకోలేక శుక్రవారం అత్తగారి ఇంట్లోనే ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకుందని చెప్పారు. మృతురాలి తల్లి కోసిగి గ్రామానికి చెందిన పక్కీరమ్మ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. అయ్యమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి, అంతిమ సంస్కారాలు కల్లుబావి శ్మశాన వాటికలో పోలీసుల సమక్షంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

మంత్రాలయం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందని జేసీఎస్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని 52-బసాపురం, రాంపురం గ్రామాల్లో జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 11 అంశాలకు సంబంధించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల, వలంటీర్లు ఇంటింటా వెళ్లి ప్రజలకు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న దరఖాస్తు దారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాంతరెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాడాలి

ఆదోని రూరల్ : కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికై పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌సీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సీపీఐ జిల్లా సమితి కార్యదర్శివర్గ సభ్యులు అజయ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దేవిశెట్టిప్రకాష్, నీలకంఠప్ప, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా నాయకులు మల్లికార్జున, ఆర్యవైశ్య మాజీ అధ్యక్షులు ఎస్‌ఆర్‌ఐ నగేష్‌కాకుబల్, పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీవోస్ హోమ్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు ఆదోని నుంచి కర్నూలుకు చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జగనన్నతోనే వాల్మీకుల అభివృద్ధి



ఎమ్మెల్యే సాయిని సన్మానించిన రామచంద్ర, ప్రవీణ్, ఫొటోలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోనిటౌన్ : జగనన్నతోనే వాల్మీకుల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన పొగాకు రామచంద్ర, సమన్వయకర్త ప్రవీణ్, పాదయాత్ర నట్టేష్‌కుమార్ ఆదోనిలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వాల్మీకి పట్టణాధ్యక్షుడు దేవాను కలిశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్‌గా తనను ఎంపిక చేసిన ఎమ్మెల్యేలు, మంత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వీవీఎస్ లక్ష్మి

ఆదోని రూరల్ : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదోని సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి వీవీఎస్ లక్ష్మి సూచించారు. ఈ మేరకు శనివారం మండలంలోని చాగి, నారాయణపురం గ్రామాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకే గొడవలకు పోయి కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేసుకోరాదన్నారు. సమస్యలను సామరస్యాంగా పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. పిల్లలను బాగా చదివించడంలో పోటీ పడాలన్నారు. చదువుతోనే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయని సూచించారు.

సబ్సిడీపై సన్నబియ్యం పంపిణీ



సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆదోని రూరల్ : ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.51కే (కిలో) రైతు బజారులో సన్నబియ్యాన్ని సబ్సిడీపై అందజేస్తున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక రైతుబజారులో సబ్సిడీ బియ్యం పంపిణీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటిరకం సోనా మసూరి బియ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సబ్సిడీపై అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రతి వినియోగదారుడికి 5 కేజీల వరకు రూ.51కే అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌డీటీ వలీబాషా, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, రైస్‌మిల్లర్లు సోమిశెట్టి శ్రీనివాసులు, బషీర్, సుధాకర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.